క్లుప్తంగా

చలివేంద్రం ఏర్పాటు


చలివేంద్రం వద్ద నీటిని అందిస్తున్న యోగా గురువు సురేష్‌నాయుడు

బుచ్చినాయుడుకండ్రిగ: మండల కేంద్రంలోని నాలుగు రోడ్ల కూడలి వద్ద ఆదివారం యోగా గురువు సురేష్‌నాయుడు తాగునీటి చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బుచ్చినాయుడుకండ్రిగకు వివిధ పనుల నిమిత్తం గ్రామాల నుండి ప్రజలు వస్తుంటారని, ఎండాకాలం కావడంతో తాగునీటి సమస్య లేకుండా ఉండడం కోసం చలివేంద్రం ఏర్పాటు చేశామన్నారు. వేసవికాలంలో ఎండవేడిమిని తట్టుకోవాలంటే తాగునీటిని ఎక్కువ తాగాలని తెలిపారు. తాగునీటి కోసం ఎవరూ ఇబ్బంది పడకుండా ఉండాలంటే చలివేంద్రాలు అవసరమన్నారు.

రథసప్తమికి ప్రత్యేక ఏర్పాట్లు

నగరి: టీటీడీ ఆధీనంలో ఉన్న బుగ్గ అన్నపూర్ణా సమేత కాశీవిశ్వేశ్వర ఆలయంలో ఈ నెల 10వ తేదీ నిర్వహించనున్న రథసప్తమి ఆర్జిత కల్యాణోత్సవ వేడుకలను పురస్కరించుకొని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ అధికారి గుణశేఖర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయంలో చలువ పందిళ్లు, విద్యుత్ దీపాలు, ప్రత్యేక పుష్పాలంకరణ చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. ఉదయం స్వామివారికి, అమ్మవారికి తిరుమంజనం, సాయంత్రం ఆర్జిత కళ్యాణోత్సవం నిర్వహిస్తామన్నారు. పాల్గొన దలచిన దంపతులు రూ.500 ఆలయం వద్ద అధికారులకు చెల్లించి నమోదు చేసుకోవాలన్నారు.

శేష వాహనంపై కరకంఠేశ్వరుడు


శేష వాహనంపై శ్రీకరకంఠేశ్వర స్వామివారు

నగరి: పట్టణ పరిధిలోని శ్రీకామాక్షీ సమేత కరకంఠేశ్వర ఆలయంలో నిర్వహిస్తున్న పంగుణోత్తర కల్యాణోత్సవ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామివారిని శేష వాహనంపై ఊరేగించారు. ఈ సందర్భంగా ఆలయంలో అభిషేకం, అర్చనలు నిర్వహించారు. ప్రత్యేక అలంకారంలో ఊరేగింపుగా వచ్చిన స్వామికి కొబ్బరికాయలు కొట్టి, కర్పూర హారతులు ఇచ్చి భక్తులు దర్శించుకున్నారు. ఆలయ ధర్మకర్త సుబ్రమణ్యం ఏర్పాట్లను పర్యవేక్షించారు. శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి ఆర్యవైశ్య సంక్షేమ సేవా సంఘం వారు ఈ సేవకు ఉభయదారులుగా వ్యవహరించారు.


చంద్రమౌళీశ్వరుని తాకిన సూర్యకిరణాలు


స్వామివారిపై పడుతున్న సూర్యకిరణాలు


ఆలయంలోకి ప్రవేశిసుస్తున్న సూర్యకిరణాలు

నగరి: కీళపట్టు శ్రీచంద్రమౌళీశ్వర స్వామి ఆలయంలో సూర్యకిరణాలు చంద్రమౌళీశ్వరుని స్పృశించడం ప్రత్యేకతను సంతరించుకుంది. సూర్యకిరణాలు శివలింగం వరకు ప్రవేశించడాన్ని స్థానిక భక్తులు ఆసక్తిగా తిలకిస్తున్నారు. కిరణాలు ఒక మార్గంలో వెళ్లి శివలింగంపై పడుతుండడంతో భక్తులు ఉత్సాహం చూపిస్తున్నారు. వారం రోజులపాటు కిరణాలు ఆలయంలో ప్రవేశించి శివలింగంపై పడుతాయని ఆలయ నిర్వాహకులు తెలుపుతున్నారు.

పెద్దలకు సన్మానం


పుత్తూరులో అన్నదానం

పుత్తూరు: శ్రీరామనవమి, బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం స్థానిక నాయకులు పేదలకు అన్నదానం, సీనియర్ నాయకులకు సన్మానం చేశారు. ముఖ్య అతిథి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చిలకం ఈశ్వర్‌ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ పేదల అభ్యున్నతికి చిత్తశుద్ధితో పనిచేస్తున్న బీజేపీ పట్ల ప్రజలకు అపార విశ్వాసం ఉందన్నారు. అనంతరం సీనియర్ నాయకులైన గుత్తా నారాయణ స్వామి, గంగయ్య, రాజయ్యలను ఘనంగా సన్మానించారు. ఈశ్వరాలయం వద్ద పేదలకు అన్నదానం చేశారు. నాయకులు గిరిప్రసాద్, చెన్నకేశవులు, కోటకొండ బాబు, హరిబాబు, మేకల సుబ్రమణ్యం, రమేష్‌నాయుడు, బాలిరెడ్డి, మునికృష్ణనాయుడు పాల్గొన్నారు.

రోజు రోజుకూ ఎండలు మండుతున్నాయి. ఏప్రిల్ నుంచి జూన్ వరకూ ఎండులు తీవ్రంగా ఉంటాయి. ప్రజలంతా జాగ్రత్తగా ఉండాలని వైద్యాధికారులు హెచ్చరిస్తున్నారు. సాధారణం కంటే అధిక స్థాయిలో ఉష్ణోగ్రతలు, వడగాడ్పులు ఎక్కువగా ఉండే అవకాశాలున్నట్లు భారత వాతావరణ విభాగం(ఐఎండీ) స్పష్టం చేసింది. సాధారణంగా ఏప్రిల్ నుంచి జూన్ మధ్యలో వారం రోజుల పాటు వడగాడ్పులు వీస్తాయి. ఈ ఏడాది అదనంగా మరో ఏడు రోజులు పాటు తీవ్రత పెరుగునున్నట్లు ప్రకటించారు. ఇప్పటికే ఉక్కపోత పెరిగింది. శ్రామిక, ఉద్యోగ, వ్యాపారులు విధి నిర్వహణలో భాగంగా అనివార్య పరిస్థితుల్లో మండే ఎండల్లో తిగగక తప్పదు.
–పాలసముద్రం

వేసవి కాలం.. ఉపశమనం ఓఆర్‌ఎస్


పీహెచ్‌సీకి వచ్చిన వారికి ఓఆర్‌ఎస్ ద్రావణం పంపిణీ

నియోజకవర్గంలో ఇసుక లోడింగ్ చేస్తుంటారు. చిరు వ్యాపారులు, ద్విచక్ర వాహనాలపై, కూరగాయలు విక్రయిస్తుంటారు. మండలంలో సీఎం కండ్రిగ, ఆముదాల, బాలక్రిష్ణాపురం, పాలసముద్రం, బలిజకండ్రిగ, ఎస్‌కేఆర్ పురం గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో కూలి పని చేస్తున్నారు. వీరందరూ ఎండ ప్రభావాలకు లోనుకాకుండా తగిన జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాలని నిపుణులు తెలుపుతున్నారు.

వడదెబ్బ తగిలే అవకాశం

శరీరంలో సహజంగా నీటి శాతం తగ్గిపోవడంతో వడదెబ్బకు గురి అవు తుంటారు. ఇలాంటి ప్రమాదానికి గురికాకుండా ఉండేందుకు ఓఆర్‌ఎస్ ద్రావణం ఉపకరిస్తుందని వైద్యులు చెబుతున్నారు.

- ఓఆర్‌ఎస్ తగిన మోతాదుతో తాగడం తప్పనిసరి

ఓఆర్‌ఎస్ ద్రావణం ప్రాధాన్యతపై పాలసముద్రం పీహెచ్‌సీ వైద్యాధికారి మోహన్‌క్రిష్ణ ఇలా వివరించారు. స్థల కాలాలను బట్టి శరీరాన్ని నిర్దేశించిన ఉష్ణోగ్రతలో ఉంచుకోవాలి. మెదడులో హైపో థలామస్ అనే భాగం శరీరంలోని వేడిని క్రమబద్ధీకరిస్తుంది. తగిన నీటిని తాగకపోయినా.. ఎండలో ఎక్కువ తిరిగినా హైపో థలామస్ భాగమే అధిక ఉష్ణోగ్రతకు లోనై క్రమబద్ధీకరించే పని చేయలేదు. ఈ స్థితిలో తల తిరగడం, నీరసం, తలనొప్పి, జ్వరం, చీకటి కమ్మినట్టు అనిపించడం, వాంతి అవుతున్న భావన లక్షణాలు వడదెబ్బకు గురైనట్టు నిర్ధారణ చేస్తాయి.

ఓఆర్‌ఎస్ తయారీ

ఓఆర్‌ఎస్ అనేది లవణాల మిశ్రమంతో కూడిన 20.5 గ్రాముల పౌడర్ ప్యాకెట్. దీనిలో 2.6 గ్రాముల సోడియం క్లోరైడ్. 1.5 గ్రాముల పోటాషియం క్లోరైడ్, 2.9 గ్రాముల సోడియం సిట్రేట్, 13.5 గ్రాముల డెక్స్‌ట్రోజ్ ఉంటాయి. ఈ పౌడర్ ప్యాకెట్‌ను సురక్షితమైన లీటరు నీటిలో కలిపి రోజు మొత్తంలో వయస్సును బట్టి తగిన మోతాదులో తాగాలి

మితిమీరిన మోతాదులో తాగడమూ అనర్థాలు తెచ్చి పెడుతుంది. ప్రభుత్వ ఆసుపత్రులు వైద్య, ఆరోగ్య కార్యకర్తలు వద్ద ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉన్నాయి. సమయానికి ఓఆర్‌ఎస్ ప్యాకెట్ అందుబాటులో లేకపోతే ఇంటిలోనే ఉప్పు, పంచదార, నీరు సాయంతో ఈ ద్రావణాన్ని తయారు చేసుకోవచ్చు. లీటరు నీటిలో చిటికెడు ఉప్పు, చారెడు(అరస్పూన్) పంచదార కలిపి సేవించవచ్చు. రెండేళ్లలోపు వారు 50 నుంచి 100 ఎంఎల్‌ను అరస్పూన్ చొప్పున ప్రతి పది నిమిషాలకు ఒకసారి తాగాలి. రెండు నుంచి పదేళ్ల వారు 100–200 ఎంఎల్ (ఒకగ్లాస్)వరకూ ఒక స్పూన్ చొప్పున తాగాలి. పదేళ్ల పైడిన వారు 50 ఎంఎల్ (చిన్న గ్లాస్) చొప్పున ఎండలో సంచరిస్తున్న స్థితిగతులను బట్టి తాగుతూ ఉండాలి. ఎండ తీవ్రతకు ఎలాంటి ఆరోగ్య సమస్యలు తలెత్తినా దగ్గరలోని ప్రభుత్వ ఆసుపత్రిని సంప్రదించాలని వైద్యులు చెబుతున్నారు.

ఓఆర్‌ఎస్ ద్రావణం తీసుకోవాలి



ప్రస్తుతం ఎండల తీవ్రత ఎక్కువగా ఉంది. వడదెబ్బ తగలకుండా ప్రజలు ఓఆర్‌ఎస్ ద్రావణం తీసుకుకోవాలి. గర్భవతులు అత్యవసర పరిస్థితిలో బయటికి రావాలంటే గొడుగు నీడలో రావాలి. ప్రసవం వరకు మజ్జిగ, పండ్లరసం, ఓఆర్‌ఎస్ ద్రావణం ఎక్కువగా తీసుకుంటే మంచిది.
–సి.హనుమంతరావు, జిల్లా ఇమ్యూనైజేషన్ ఆఫీసర్

ఆశాలు అవగాహన కల్పించాలి



ప్రస్తుతం మారుతున్న వాతావరణంతో గ్రామాల్లో ఓఆర్‌ఎస్ ద్రావణంపై అవగాహన కల్పించాలి. గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఓఆర్‌ఎస్ ద్రావణం ఉండాలి. వడదెబ్బ సోకితే వెంటనే ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య పరీక్షలు చేయించాలి. ఎండలకు ముఖ్యంగా వృద్ధులు ముందు జాగ్రత్తలు తీసుకోవాలి.
–మోహన్‌క్రిష్ణ, వైద్యాధికారి

నిర్లక్ష్యం చేయొద్దు



ఎండ తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలి. చిన్నారులు, వృద్ధుల విషయంలో మరింత అప్రమత్తంగా ఉండాలి. వడదెబ్బ లక్షణాలుంటే వెంటనే వైద్యులను సంప్రదించాలి. వేసవి కాలంలో సాధ్యమైనంత వరకు అధికంగా మంచినీరు తాగుతూ ఉండాలి.
–జ్ఞానశేఖర్, సీహెచ్‌ఓ, పాలసముద్రం పీహెచ్‌సీ

రేపు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

వెదురుకుప్పం: మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ప్రజా సమస్యల పరిష్కార కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ పురుషోత్తం ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గంగాధరనెల్లూరు ఎమ్మెల్యే థామస్ హాజరవుతారని పేర్కొన్నారు. మంగళవారం ఉదయం 10 గంటల నుంచి జరిగే ఈ కార్యక్రమానికి మండల స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

పూర్వ విద్యార్థుల సేవలు ఎనలేనివి


సరస్వతి విగ్రహానికి పూజలు

పాలసముద్రం: మండలంలోని బలిజకండ్రిగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు పూర్వ విద్యార్థులు చేస్తున్న సేవలు ఎనలేనివని రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు మార్కండేయనాయుడు అన్నారు. ఆదివారం 1992–93లో పదో తరగతి చదివిన విద్యార్థులు తమ సొంత ఖర్చులతో పాఠశాలకు ఆవరణలో సరస్వతి విగ్రహం ప్రతిష్టించి 40 రోజులు పూర్తయిన సందర్భంగా ప్రత్యేక పూజలు చేపట్టారు. మొట్ట రిటైర్డ్ హెచ్‌ఎం మార్కండేయనాయుడుకి పాదపూజలు చేసి ఆశీర్వాదాలు తీసుకున్నారు. ప్రస్తుత హెచ్‌ఎం రఘు మండడి, ఉపాధ్యాయుడు రమేష్, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.


రిటైర్డ్ హెచ్‌ఎం, స్థల దాతలకు సన్మానం

ఘనంగా కల్యాణోత్సవం


ప్రత్యేక అలంకరణలో వినాయకుడు


ప్రారంభోత్సవం చేస్తున్న మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

- పాల్గొన్న మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

వెదురుకుప్పం: శ్రీరామ నవమి పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని జీటీ కండ్రిగ వద్ద గంగాధరనెల్లూరు నియోజకవర్గ వైఎస్ఆర్ సీపీ మహిళా అధ్యక్షురాలు, వెదురుకుప్పం ఎంపీటీసీ సభ్యులు రాధిక, పురంధర్‌రెడ్డి నూతనంగా నిర్మించిన పీఆర్‌సీ కల్యాణ మండపం ప్రారంభోత్సవం అట్టహాసంగా జరిగింది. ఆదివారం మాజీ ఉప ముఖ్యమంత్రి కె.నారాయణస్వామి, వైఎస్ఆర్ సీపీ నేతలతో కలిసి ప్రారంభోత్సవం చేశారు. పీఆర్‌సీ కల్యాణ మండపం ప్రారంభోత్సవం సందర్భంగా సీతారాముల కల్యాణాన్ని రుత్వికులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి, గంగాధరనెల్లూరు నియోజకవర్గ నాయకుడు హరికృష్ణ కల్యాణోత్సవానికి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. వైఎస్ఆర్ సీపీ మండల అధ్యక్షుడు పద్మనాభరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి పేట ధనుంజయరెడ్డి, ఎం.రామయ్య, బట్టే సుబ్రమణ్యం, ఎంపీటీసీలు తోకల మురళీరెడ్డి, మునిచంద్రారెడ్డి, వెంకటేశ్, సర్పంచ్‌లు శిల్ప, గోవిందయ్య, చిరంజీవి రెడ్డి, పెద్దిరెడ్డి, హనుమంతరెడ్డి, గఫూర్, వాసుదేవ రెడ్డి, భీమశంకర్‌రెడ్డి, నరేష్ రెడ్డి, మునికృష్ణారెడ్డి, పరంధామరెడ్డి, విజయశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

త్వరితగతిన ఆలయ నిర్మాణం



ఆలయ నిర్మాణ పనులను సందర్శించిన మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి, రోడ్డు ప్రమాదంలో గాయపడిన సునీల్‌కు పరామర్శ

- మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి

కార్వేటినగరం: పురాతన ఆలయాల్లో ఒక్కటైన శ్రీవరద వెంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి పూర్వ వైభవం తీసుకురావాలని రాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని ఆలత్తూరు గ్రామంలో వెలసి ఉన్న పురాతన ఆలయ నిర్మాణ పనులను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు 400 సంవత్సరాల క్రితం నిర్మాణం చేపట్టిన పురాతన ఆలయాన్ని టీటీడీతో అనుసంధానం చేసిన ఘనత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. ఆలయ పునర్నిర్మాణానికి వైఎస్ఆర్ సీపీ ప్రభుత్వం సుమారు రూ.2.20 కోట్లు మంజూరు చేసిందన్నారు. దీంతో 75 శాతం పనులు పూర్తి అయ్యిందని, అంతలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పనులు ఆగాయని పేర్కొన్నారు. టీటీడీ డీఈ భాస్కర్‌కి ఫోన్ చేసి పాత కాంట్రాక్టర్‌ను రద్దు చేసి, కొత్త కాంట్రాక్టర్‌ను నియమించి ఆలయ నిర్మాణాన్ని పూర్తి చేయాలని కోరారు.

పరామర్శ

మండల పరిధిలోని ఆలత్తూరు గ్రామానికి చెందిన వైఎస్ఆర్ సీపీ జేసీఎస్ కన్వీనర్ పురంధర్ సోదరుడు సునీల్ రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. సమాచారం అందుకున్న మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి గ్రామానికి వెళ్లి సునీల్ ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట మండల కన్వీనర్ శేఖర్‌రాజు, చందురాజు, చిరంజీవిరెడ్డి, గోపి, మునికుమార్, ధర్మయ్య, సుధాకర్, మనోహర్‌రెడ్డి, కోటినాయుడు, చిరంజీవి, విజయులురెడ్డి, ఆలయ స్థల దాత గురుస్వామిరెడ్డి, డాక్టర్ మునిరత్నం, గాజుల పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీరామనవమి ఉత్సవాలు





పాత భజనగుడి వీధిలోని రామాలయం, భేరీవీధిలోని రామాలయం, హనుమంత వాహన సేవ, స్వామివారికి కల్యాణోత్సవం

కార్వేటినగరం: శ్రీరామనవమి ఉత్సవాలను పురస్కరించుకుని శ్రీరుక్మిణీ, సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి ఆలయ ఆవరణలో వెలసి ఉన్న శ్రీసీతారాముల వారి ఆలయంలో శ్రీరామనవమి ఉత్సవాలు ఆదివారం వైభవంగా ముగిశాయి. అర్చకులు స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి శుద్ధి, తోమాల, అర్చన, పంచాంగ శ్రవణం నిత్య కైంకర్యాలను నిర్వహించారు. అనంతరం మూల విరాట్ ఏకాంత తిరుమంజనం నిర్వహించి శ్రీసీతారాముల వారితో పాటు లక్ష్మణుడి ఉత్సవమూర్తులను పట్టువస్త్ర సుగంధ భరిత పుష్పమాలికలు, విశేష ఆభరణాలతో సుందరంగా అలంకరించి స్వామివారి భక్తాగ్రేసరుడైన హనుమంత వాహనంపై ప్రతిష్టించి చెక్కభజనలు, మంగళవాయిద్యాల నడుమ పుర వీధుల్లో ఊరేగించారు. గ్రామ వీధోత్సవంలో అనంతరం మధ్యాహ్నం 11.30 నుంచి 12.30 గంటల వరకు స్వామివారికి శ్రీరామ నవమి ఆస్థానం నిర్వహించారు.

నేత్రపర్వంగా కల్యాణోత్సవం

శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో వెలసి ఉన్న శ్రీసీతారాముల వారికి శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా సీతారాముల కల్యాణాన్ని వేద పండితులు వేద మంత్రాల నడుమ సీతమ్మ శిరస్సుపై ముత్యాల తలంబ్రాలు పోసి నేత్రపర్వంగా నిర్వహించారు. కల్యాణోత్సవానికి దంపతులు అధిక సంఖ్యలో పాల్గొని తిలకించారు.

సర్వభూపాల వాహనం

శ్రీరామనవమి ఉత్సవాలను పురస్కరించుకుని వేద పండితులు శ్రీసీతారాముల సమేత లక్ష్మణ ఉత్సవమూర్తులను అలంకార మండపానికి వేంచేసి పట్టువస్త్ర, సుగంధ భరిత పుష్పమాలికలు, విశేష ఆభరణాలతో ప్రత్యేకంగా అలంకరించి సర్వభూపాల వాహనంపై ప్రతిష్టించి రాత్రి 7 నుంచి 9 గంటల వరకు మంగళవాయిద్యాల నడుమ అంగరంగ వైభవంగా గ్రామ వీధుల్లో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ ఆలయ అధికారులు సురేష్‌కుమార్, వేద పండితులు రమేష్, శబరి, గోపాలాచారి, శివశర్మ, షరాబు బాబుసురేష్, సిబ్బంది పాల్గొన్నారు.

సరస్వతి శిశు మందిరంలో..

కార్వేటినగరం: మండల కేంద్రంలో శ్రీవేణుగోపాలస్వామి మాడ వీధిలోని సరస్వతి శిశు విద్యామందిరంలో ఆదివారం శ్రీరామనవమి వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు శ్రీసీతారాముల వారి చిత్రపటానికి పూలమాల వేసి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులు బాల రామాయణం శ్లోకాలను పఠించారు. ఈ సందర్భంగా ఎన్‌జీఓల పుత్తూరు డివిజన్ కార్యదర్శి శశిధర్‌రెడ్డి మాట్లాడుతూ సరస్వతీ శిశు మందిరాలు ఆధ్యాత్మిక క్షేత్రాలుగా విరాజిల్లుతున్నాయని, ఇలాంటి విద్యామందిరంలో విద్యనభ్యసించడం పిల్లల అదృష్టమన్నారు. ఈ కార్యక్రమంలో సురేష్, శిశు మందిర్ ప్రధానాచార్యుడు రోశయ్య, ప్రసాద్, శిరీష, గాయత్రి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పాలసముద్రంలో..

పాలసముద్రం: మండల పరిధిలోని ప్రజలు ఆదివారం శ్రీరామనవమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. క్రిష్ణజమ్మపురం గ్రామంలో వెలసిన ద్రౌపదీ అమ్మవారి దేవాలయ ఆవరణలో ఉన్న హనుమాన్ విగ్రహం ఎదుట శ్రీరామనవమి వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. శ్రీసీతారామ లక్ష్మణ సమేత హనుమంతుల వారి విగ్రహానికి వేదపండితులతో ప్రత్యేక పూజలు అభిషేకాలు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. శ్రీరామ నవమి వేడుకల్లో కోలాటం బృందం వేసినది భక్తులకు ఆకట్టుకుంది. సాయంత్రం భక్తులు స్వామివారిని క్యూలో నిలిచి టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు.

నగరిలో...

నగరి: చైత్రశుద్ధ నవమినాడు మున్సిపాలిటీ, మండల పరిధిలో ఆదివారం శ్రీరామనవమి పూజలు వైభవంగా నిర్వహించారు. భేరివీధిలోని శ్రీకోదండరామాలయం, పాతభజనగుడి వీధిలోని రామాలయం, కొత్తపేట కోదండరామాలయం, మండలంలోని దిగువ అయనంబాకం, ఎగువ అయనంబాకం రామాలయాల్లో, మేళపట్టు శ్రీరామాలయంలో, రాజుల కండ్రిగలోని రామాలయంలో శ్రీరామనవమి ఉత్సవాలు వైభవంగా జరిగాయి. ఆలయాల్లో రామాయణ పారాయణం చేశారు. సీతారామలక్ష్మణ ఆంజేయ స్వాముల విగ్రహాలకు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. స్వాములను పుష్పాలు, పట్టువస్త్రాలతో సుందరంగా అలంకరించగా భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు విచ్చేసిన భక్తులకు వడపప్పు, పానకం ప్రసాదాలు అందించారు.

వెదురుకుప్పంలో..

వెదురుకుప్పం: శ్రీరామ నవమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం వేడుకలను ఘనంగా నిర్వహించారు. డీఆర్ఎస్‌కండ్రిగ సమీపంలోని శ్రీజ్ఞాన ప్రసూనాంబ సమేత కొండమల్లీశ్వర స్వామి ఆలయం ఆవరణలో ఉన్న పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయంలో సీతారాముల కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. పచ్చికాపల్లంలో ఉన్న శ్రీకోదండ రామ స్వామి ఆలయంలో ప్రత్యేక అభిషేక పూజలు చేశారు. కల్యాణం శాస్త్రోక్తంగా సాగింది. సంతబయలు గ్రామంలో సర్పంచ్ రాజేశ్వరి ఆధ్వర్యంలో రామాలయంలో ప్రత్యేక పూజలు ప్రారంభమయ్యాయి. పెరుమాళ్లపల్లెలో ప్రత్యేకంగా వేడుకలు నిర్వహించారు.

పెనుమూరులో..

పెనుమూరు(కార్వేటినగరం): చిత్తూరు–పెనుమూరు రహదారిపై ఉన్న వాగ్దేవి సవితా సేవాశ్రమంలో ఆదివారం శ్రీసీతారామ కల్యాణోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆశ్రమ అధినేత స్వామీ పూజానంద ఆధ్వర్యంలో అమ్మవారి శిరస్సుపై ముత్యాల తలంబ్రాలు పోసి కల్యాణోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు.





వెదురుకుప్పం: అరుణగిరిపై స్వామి అమ్మవార్ల కల్యాణోత్సవం, మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు, ఆలయ ఆవరణలో కోలాటాలు, శ్రీసీతారాముల కల్యాణోత్సవం

పన్నూరులో నూతన బోరు



దళిత వాడలో నూతనంగా బోరు వేస్తున్న సర్పంచ్, లీకేజ్ పైపును సరి చేస్తున్న సిబ్బంది

విజయపురం: వేసవిలో తాగునీటి కష్టం రాకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు పన్నూరు సర్పంచ్ కుమార్ తెలిపారు. ఆదివారం పన్నూరు ఆదిఆంధ్రవాడ, దళితవాడల్లో నూతనంగా బోరు వేసినట్లు ఆయన పేర్కొన్నారు. అలాగే ఓవర్ ట్యాంక్ వద్ద ఓవర్‌ఫ్లో పైపులైన్ లీకేజీకు మరమ్మతు పనులు చేపట్టారు. అనంతరం ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఉన్న తాగునీటి విద్యుత్ మోటార్, పైపులైన్ సరి చేశారు. తాగునీటి కోసం నూతనంగా వేసిన బోర్లలో ఆశించిన స్థాయిలో నీళ్లు వచ్చిందని, త్వరలో పైపులైన్లు ఏర్పాటు చేసి, పంచాయతీలోకి అన్ని గ్రామాలకు తాగునీరు అందిస్తామని ఆయన పేర్కొన్నారు.

కనువిందుగా శ్రీసీతారాముల కల్యాణం


వేల్కూరులో గరుడ వాహన సేవ

గంగాధరనెల్లూరు: శ్రీరామనవమి సందర్భంగా మండల వ్యాప్తంగా శ్రీరామ భజన మందిరాలలో భక్తిశ్రద్ధలతో శ్రీరామనవమి వేడుకలు నిర్వహించారు. మండలంలోని వేల్కూరు గ్రామంలో శ్రీసీతారామ ఆలయాన్ని విద్యుద్దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు. శ్రీసీతారాములవారికి కల్యాణోత్సవం కార్యక్రమాన్ని వైభవంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అలాగే మండల కేంద్రంలోని ఎగవూరు శ్రీభక్త సీతారామాంజనేయ బృందం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి హోమాలు నిర్వహించారు. అలాగే వేపంజేరి ఆలయంలో శ్రీలక్ష్మీ నారాయణ స్వామి ఆలయంలో శ్రీరామనవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యాప్తంగా అన్నదాన కార్యక్రమాలు ప్రత్యేక భజనలు, ఊరేగింపులు నిర్వహించారు.